


"ఏడు కొండల వాడా! వెంకటరమణా! నా పసుపూ కుంకుమా నిలబెట్టు తండ్రీ! ఈ గండం గడిచినా మాంగల్యం కాపాడు వెంకటేశా! వారితో కొండకు వచ్చి, నిన్ను దర్శించుకుంటాను." పమిట కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ వెంకటేశ్వరస్వామి పటం ముందు ముడుపు కట్టి ఉంచుతూ ప్రార్థించింది శాంతి.

మంగళసూత్రాలు తీసి కళ్ళ కద్దుకుని, గదిలోకి వచ్చింది. ఒక పక్కగా మూడేళ్ళ చిట్టిబాబు నిద్రపోతున్నాడు. అటుపక్క గోడవేపున ఉన్న మంచం **మీద నిశ్చలంగా పడుకున్న భాస్కరం వేపు చూడ**గానే శాంతి కళ్ళల్లో నీళ్ళు ఉబికాయి. గడియారం తన పని తాను చేసుకుపోతుంది. రాత్రి పదైంది.

డాక్టర్లు కూడా పసిగట్టలేని ఏదో విషజ్వరంతో నాటికి మూడు రోజులై మూసిన కన్ను తెరవలేదు భాస్కరం. పేరుమోసిన డాక్టర్లు వచ్చి చూసి వెళ్ళుతున్నారు. ఆ రాత్రి మెలకువ వచ్చి తీరాలని పెద్ద డాక్టరు వెళ్ళుతూ చెప్పాడు.

మెల్లగా మంచం దగ్గరకు వచ్చి, భాస్కరాన్ని చూస్తూ కూర్చుంది శాంతి.

'ఇది తీరే మొక్కేనా? భాస్కరం దీనికి సరేమిరా ఒప్పుకుంటాడా? దేవుడు, పూజలు, వ్రతాలు, మొక్కుబడులు—ఇలాంటి వంటే ఆవగింజంతైనా నమ్మకం లేని భాస్కరాన్ని తిరుపతి కొండకు రమ్మంటే వస్తాడా?' అస్తవ్యస్తంగా ఆలోచిస్తున్న శాంతికి గడచిన కొన్ని సంఘటనలు గుర్తుకొచ్చాయి.

* * *

"వదినా ... ఓ వదినా ...నువ్వు చూస్తే ఇలా పూర్వకాలపు పద్ధతిలో శ్రావణ శుక్రవారాలనీ, మార్గశిర లక్ష్మీవారాలనీ, వ్రతాలనీ, నోములనీ చేస్తుంటావ్. మరి మా అన్నయ్య కేమో ఇలాంటి వేం నచ్చవ్. మాటిమాటికి పూజలు, కళ్యాణాలు చేయకు వేలు ఖర్చు చేసే బదులు ఆ ఎలిమెంటరీ స్కూలు గోడ ఒక పక్క పడిపోతోంది, దాన్ని కాస్త రిపేరు చేయించరాదా? ఉపవాసా

లండి దద్ధోజనం, పులిహోర, చక్కెర పొంగలి చేయించి, ఆ మహాగ విరాట్‌లకు ఆరగింపు చేయించా మని తృప్తి పడి, ఆ ప్రసాదమంతా మనం సుష్టుగా ఆరగించే బదులు శ్రీశ్రీ చెప్పిన — 'మహాలుగుతూ ముసురుతున్న ఈగలతో వేగలేక' సతమతమయ్యే ఒక ముసలిదానికి ఒక్క పూట, కనీసం ఒక్క పూట కడుపునిండా భోజనం పెట్టరాదూ? ఏం మనుషులో, ఏం లోకమో? ఆకలితో కేకలు వేసే తోటి మానవుణ్ణి విస్మరించి, ఆ మనిషే చేసిన ఒక రాతిని రత్నాభరణ భూషితను చేసి, వేలకు వేలు ఖర్చు చేసి, ఏమీ కోరని ఆ విగ్రహానికి ఎన్నో కోరుతున్నా డనే పేరిట ఎంతో ఖర్చు చేసి డబ్బు తగలెడుతున్నారు. ఆ డబ్బు ఏ సాంఘిక సంక్షేమ నిధికో, ఒక బీద విద్యార్థి చదువుకో, ఏ కుష్ఠు నిరోధక సంస్థకో ఇచ్చి ఆదుకుంటే ఎంతో దేశసేవ చేసినవా రవుతారు. ఎందు కిలా దేవుడి పేరుతో ఇంత దుబారా చేస్తారో అర్థంకాదు. ఎప్పటికి మారేనో ఈ సమాజం" అంటూ అనర్గళంగా అరగంట సేపు ఉపన్యాస మిస్తూండాడు. 'అలాంటప్పుడు వాడికీ, నీకూ ఎలా కుదురుతుందో, మీ సంసారం ఎలా నడుస్తుందో వేచి, చూచి తీరాల్సిందే' అని రాధ అనేది. అయినా భాస్కరన్ని




# హేపీ బాత్ డే టు యూ!

## హిందుస్థాన్ శానిటరీ వేర్, సోమా మెటల్ ఫిట్టింగ్స్, సోమానీ పెల్కింగ్‌టన్స్ వాల్ టైల్స్‌తో

హిందుస్థాన్ శానిటరీ వేర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్
భారత దేశపు అత్యధిక అమ్మకపు వస్తువులను తయారు చేసేది, అత్యధిక సంఖ్యలో బాత్ రూమ్ పరికరాలను ఎగుమతి చేసేది.

సోమా ప్లంబింగ్ ఫిక్స్చర్స్ లిమిటెడ్
హిందుస్థాన్ శానిటరీ వేర్ వారి పూర్తిగా స్వంతం చెయ్యబడ్డ శాఖ.

సోమానీ పెల్కింగ్‌టన్స్ లిమిటెడ్

2, రెడ్ క్రాస్ ప్లేస్, కలకత్తా-700 001

హిందుస్థాన్ శానిటరీ వేర్ ఉత్సాహకరమయిన రంగులతో వచ్చింది. సోమా మెటల్ ఫిట్టింగ్స్ అంతర్జాతీయ ఖండితానికి సరియైనది. లీకు అవకుండా, డ్రిప్ కాకుండా నమ్మకంగా పని చేసేది. సొగసుగా తీర్చిదిద్దబడింది. 5 సంవత్సరాలకు గ్యారంటీ ఇవ్వబడింది. సోమానీ పెల్కింగ్‌టన్స్ వాల్ టైల్స్ ముగ్ధుల్ని చేసే డిజైన్లూ రంగులూ. శుభ్రం చెయ్యడానికి సులభం.

HSI.794-TEL

తాను తప్పక పూర్తిగలనని అనుకునేది ఆ రోజుల్లో!

"పెళ్ళికి పురోహితుడు, బాజా మేళాలు, విందులు, వినోదాలు—ఈ ఆర్భాటాలన్నీ ఎందుకు? నా కిందులో ఏం అర్థం కనిపించడం లేదు. ఇదంతా కేవలం డబ్బు దండుగ. సరదాలు తీర్చుకోవడానికి చేసిన ప్లాను. అంతకన్నా ఇంకేం లేదు. చట్ట ప్రకారం రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసుకుని, పై తతంగమంతా ఈ వివాహానికి సాక్ష్యంకోసం మాత్రమే గనక, అంతకన్న సింపుల్‌గా పత్రికలో ఈ పెళ్ళి వివరాలు ఫోటోతో సహా ప్రచురిస్తే, పేపరు చదివే ప్రతి వాడూ ఇందుకు సాక్షి అవుతాడు. ఇంకా లోతుకు పోతే, నిర్మలానురాగంతో కలిసి కాపురం చేయబోయే భార్యాభర్తలకు ఖర్మ కాకపోతే — ఇంత మంది సాక్షులు దేనికి? ఇన్ని సాక్ష్యాలుంటేగాని కాని పెళ్ళి ఒక పెళ్ళేనా? దేశంలో ఎంతోమంది తిండిలేక మల మల మాడిపోతుంటే, ఇలా మనం విందులూ, వినోదాలూ చేసుకోవడం చాలా అన్యాయం" అంటూ, తన వివాహం కూడా అక్షరాలా అలాగే జరిపించాడు. ఆ నాడు అటు ఆడ పెళ్ళివారింటా, ఇటు మగ పెళ్ళివారింటా ఎంతటి అలజడి చెలరేగిందని?!

"హవ్వ! ఎంత చిదవ కాలం వచ్చి పడిందమ్మా! ఒక సరదాలా? ఒక చట్టు బండలా? పురోహితుడు లేని పెళ్ళి ఒక పెళ్ళే? ఏదో రిజిస్ట్రీ పెళ్ళట! ఏం జరిగి ది? ఎవరు చూసొచ్చారు? కలి ప్రవేశమంటే ఇదే మరి" అంది ఒక బామ్మ గారు.

"ఏమే శాంతీ! నువ్వేనా చెప్పరాదుటే—ఇదేం ఖర్మని? రెండు రిక్షాలలో వెళ్ళి ఒక రిక్షాలో తిరిగి రావడం, కాగితాల మీద సంతకాలు చెయ్యడం— దీన్ని పెళ్ళే అంటారుటే?! పెళ్ళి అంటే పది మంది రావాలి; బాజా మేళాలు మోగాలి; మైకు హోరున పాటలు పాడాలి. మంత్రోచ్చాటనలతో పెళ్ళి పందిరి మారు మ్రోగిపోవాలి. అంతే గానీ, ఇదేం పెళ్ళి! ఇలా అయితే మే మెవరమూ మీ ఇంటికి ఇక రాము సుమా" అన్నారు దగ్గర బంధువులు.

శాంతెంతో ప్రయత్నించింది. కానీ ప్రయోజనం లేకపోయింది. తాను దృఢంగా నమ్మిన సిద్ధాంతం నుంచి అతన్ని మరల్చడం—అదేమంత తేలికైన పని కాదు.

తొలిసారిగా తన సనాతనాచారాల మేఘాలు అతని ఆధునిక భావాల గాలికి చెల్లాచెదురై పోయినై.

అయితే ఒక్క గుణం భాస్కరంలో ఉంది. అతను తన సిద్ధాంతాలను ఇతరులపై బలవంతాన రుద్దడు. ఇతరుల నమ్మకాలను తూలనాడడు. తనను వాటిని ఆచరించమంటే మాత్రం లెక్చరు దంచేస్తాడు.

ఒకసారి ఇలాగే తాను భాస్కరంతో— "రేపు మామ గారి తద్దినం. మీరు ఆఫీసుకు శెలవు పెట్టి ఇంట్లోనే ఉండాలి. గార్లె శాస్త్రి గారినీ, పేరిశాస్త్రి గారినీ భోక్తలుగా పిలవాలి. కార్యక్రమం నడిపించడానికి మండిపూడి పంతులు గారిని రమ్మనండి. ఇదిగో—ఈ సామాన్లు ఈ రాత్రికే తెచ్చి పడేయండి" అంది.

"చూడు శాంతీ! నాతత్త్వం తెలిసీ ఇలా మాటాడ తావేం? మా నాన్న పోయి పదేళ్ళయింది. ఇవాళ ఆయన తద్దినం పేరుతో అగ్రహారంలో స్వంతిల్లు ఉన్న గార్లె శాస్త్రినీ, పెదో పదెకరాలకు తక్కువ కాని భూమి ఉన్న పేరిశాస్త్రినీ, మంగిపూడి పంతులు గారినీ పిలిచి వారికి సుష్టుగా భోజనం పెట్టి, పైగా పడ్డీ లాగ దక్షిణ ఇచ్చి పంపిస్తే, గాని లదేదో లోకంలో ఉన్న మా నాన్న ఆకలి తీరదూ? ఏం అర్థం పర్థంలేని ఆచారాలివి శాంతీ? తద్దినం అంటే తత్ + దినం అని కదా అర్థం...ఆ రోజున, అంటే మా నాన్న పోయిన రోజున వారిని తలచుకోవ డం ధర్మం. అందుకు ఇంత దుబారా చెయ్యడం నాకు సబబుగా కనబడ్డంలేదు. ఆ రోజున ఇద్దరు భోక్తలకు బదులు, నలుగురు కుంటివాళ్ళనో, గుడ్డివాళ్ళనో పిలిచి చక్కగా భోజనం పెడితే అర్థమూ పరమార్థమూ ఉంటుంది. నీకు తెలియదు గానీ శాంతి మా నాన్న పేరన ఒక స్కాలర్‌షిప్ ఏర్పాటు చేసి, ఒక బీద విద్యార్థిని చదివిస్తున్నాను. అంతేగాని అర్థం, పర్థం లేని పూర్వాచారాన్ని పట్టుకుని వేలాడమంటే నాకు మంటే. ఇవాళ తప్పకుండా మరో నలుగురికి వండు. స్పెషల్స్ చెయ్యి. అవి గారెలు, పాయసము, నువ్వులుండలే అయినా అభ్యంతరం లేదు. దీనికి నేను సెలవు పెట్టి, ఇంట్లో ఉండి చేయాల్సిం ఏముంది? వంటకి బంగారమ్మ గారికి కబురు చెయ్యి. నేను మామూలుగానే ఆఫీసుకు వెళతాను. మధ్యాహ్నం ఒక రిద్దరు అనాథల్ని, ఆ స్కాలర్‌షిప్ కుర్రాణ్ణి వెంట తీసుకువస్తాను. అందరం కలిసి భోంచేద్దాం" అని భాస్కరం అన్నాడు.

"ఇదేం మనిషిరా భగవంతుడా! అందరికీ ఒక దారైతే, ఇతడి దొక్కడిదీ ఒక దారిలా ఉంది. ఇతణ్ణి మార్చడం సంగతెలా ఉన్నా, తాను మారడం మాత్రం తథ్యం" అని అనుకుని ఊరుకుంది తాను.

"ఇలాంటి భావాలు గల భాస్కరాన్ని తిరుపతి కొండకు తీసుకు వెళ్ళడం సంభవమా . . .అని శాంతి బాధపడసాగింది.

ఇంతలో మంచం మీద భాస్కరం మెల్లిగా కదిలాడు. ఆత్రతగా అతని వంక చూస్తూ "ఏమండీ ఏం కావాలి?" అంది శాంతి.

"మ . . . మంచి . . . నీ . . .ళ్ళు . . .హీన స్వరంతో అన్నాడు భాస్కరం.

డాక్టరు వెళ్తూ చెప్పిన మాటల ప్రకారం మంచినీళ్ళలో మాత్ర గుండచేసి, కొంచెం గ్లూకోస్‌తో కలిపి మెల్లగా భాస్కరం నోటికి అందించింది. అతను అది తాగుతూ మెల్లగా గుటకలు వేశాడు.

"శా ... శాంతీ... చి ... చిట్టి ... బా ...బేదీ" అడిగాడు.

"నిద్రపోతున్నాడండీ. మీకా. కెలా ఉందీ?" అడిగింది శాంతి.

"నా ... కేం ... శాంతీ ... బా ...నే ఉంది.... ను ... నువ్వు ... భోంచేశావా? ... బా ... బాగా ... రాత్రై నట్టుంది ... ప ... పడుకోరాదూ..."

భర్త మాటలు వింటూ తన ప్రార్థన ఆలకించి నందుకు ఆ వేంకటేశ్వర స్వామిని మనసు లోనే నమస్కరించుకుంది. స్వామి తన పక్షాన ఉన్నం దుకు ఎంతో ఆనందించింది. భర్తవైపు తిరిగి—

రేడియో ఇంజనీరింగ్
స్వబోధిని



మీరు ఇంటి యందుండే తెలుగు భాషలోనే చదివి రేడియోలను అసెంబిల్ చేయుటను, రిపేరు చేయుటను నేర్పెడు కల్పవృక్షము. వెల: రూ. 10—00.
పోస్టేజి అదనం. V.P.P. ద్వారా కావలసిన వారు అడ్వాన్సు రూ. 2—లను వెంటనే M.O. చేయండి.

PILOT PUBLICATIONS,
Post Box No. 1545
31. Iyyappa Chetty Street,
MADRAS - 600 001.

దేవి పిల్సు
REGD.
వాడండి ముఖ్యంగా ఆలస్యమైన,
క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన,
లేక ఆగిపోయినబహిష్టకు
ఋతుస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు
SEALED PACKING: 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS

Mfrs. SEENU & CO. MADRAS-1



## మీ కుపయోగించేది

కుటుంబంలో ఎవరికి ఏ రోగం వచ్చినా కంగారు పడే పని లేదు. అయిదు రకాల ప్రఖ్యాతి వైద్యులు, ప్రతి రోగానికి, ఇంగ్లీషు, ఆయుర్వేద, హోమియో, ప్రకృతి మూలికా మందుల వివరాలు అందరికి తెలిసేలా "ఐదు వైద్య విధానాలు" అనే తెలుగు పుస్తకములో వ్రాశారు. అన్ని షాపుల్లో దొరికే మందులే. 427 రోగాల విముక్తి మార్గాలున్నాయి. వెల రూ. 16/— పోస్టేజి ఖర్చులు అదనం. దేశసేవ ప్రచురణలు, 5/3 ఆర్.టి. పంజాగుట్ట కాలని, హైదరాబాద్—4 కు మీకో పుస్తకం వి. పి. పోస్టు ద్వారా పంపమని వెంటనే వ్రాయండి.

Swastik



# మీకు గుర్తులేదా?

## పళ్లు, చిగుళ్ల ప్రపంచంలో ఒక కొత్త అద్భుతం

## ఫ్లోరైడ్‌తో ఫోర్‌హేన్స్ టూత్ పౌడర్

ఫ్లోరైడ్‌యుక్త ఫోర్‌హేన్స్ టూత్ పౌడర్ నిజంగా అద్భుతమైన టూత్ పౌడర్. ఇది ఆధునికమైనది, మెరుగు నిచ్చేది. మెత్తటిది మరియు మృదువైనది. నియమానుసారం దీన్ని ఉపయోగించడం వల్ల పళ్లకు పరిశుభ్రత, చిగుళ్లకు మాలిష్ లభిస్తుంది. దాని ఫలితం గట్టి పళ్లు, ఆరోగ్యమైన చిగుళ్లు!

ఫోర్‌హేన్స్ టూత్ పౌడర్‌ను నియమానుసారం ఉపయోగిస్తే పళ్లు, చిగుళ్ల బాధలు ఉండవు. దంత వైద్యుడు సృష్టించిన ఫోర్‌హేన్స్ టూత్ పేస్ట్ ఉత్పత్తి దారులే దీనిని కూడా ఇప్పుడు తయారు చేశారు.







180 గ్రా., 90 గ్రా., 45 గ్రా. డబ్బాలలో లభిస్తుంది.

187 F 152 Tel


"నేను భోంచేశానండి. నా కింకా నిద్రరావడం లేదు. మీరు విశ్రాంతి తీసుకోండి" అంది శాంతి.

తాను ఆ రోజు కటిక ఉపవాస ముంది. భాస్కరం మామూలు మనిషి కావడానికి తా నెన్ని ఉపవాసాలైనా ఉంటుంది. ఎన్ని వ్రతాలైనా, నోములైనా నోస్తుంది. తన పసుపు కుంకుమా నిలబడితే అంతే చాలు.

"శా ... శాంతీ ... నువ్వు ... భయపడుతున్నావు కదూ ... ఎందుకు ... భయం ... శాంతీ ... నేను చచ్చిపోతా ..."

"ఛ! అవేం మాటలండీ? దయచేసి అలా మాటలాడకండి. నేను పునిస్త్రీగానే పోతాను. ఆ వేంకటేశ్వర స్వామి దయవల్ల మీరు నూరేళ్ళు హాయిగానే ఉంటారు" అంటూందే కాని శాంతికి దుఃఖం పెల్లుబికి వస్తూంది. పమిట కొంగు నోటికి అడ్డం పెట్టుకుంది.

"శాంతీ ... ఎందు కలా ఏడుస్తావ్ ... నేను ... నాస్తికుణ్ణని ... న న్నే దేవుడూ కాపాడడనీ కదూ ... నీ ... భయం ..." ఆయాసంగా ఆగేడు భాస్కరం.

"దయచేసి మీరు మీరేం మాట్లాడకండి. మీకు నయమైపోతుంది. మిమ్మల్ని నేను కాపాడుకుంటాను." అక్కడ మరి నిలవలేక ఒక్క ఉదుటున లేచి వెళ్ళి పక్క గదిలో ఉన్న దేవుడి పటం ముందు నిల్చుని వెక్కి వెక్కి ఏడ్చింది. అప్పటికి గాని ఆమెకు ఉపశమనం కలుగలేదు.

• • •

ఉదయ భానునితోపాటు భాస్కరం మెల్లగా కళ్ళు తెరిచాడు.

శాంతి తెచ్చిఇచ్చిన హార్లిక్స్ గటగటా తాగేసి, "మరి కొంచెం తీసుకురా శాంతీ" అని అడిగినప్పుడు అప్పుడే వచ్చిన డాక్టరు కూడా ఆశ్చర్యపోయాడు.

"నా మందుల కన్నా నీ పూజలే ఫలించాయమ్మా! మరేం ఫరవాలేదు" అంటూ డాక్టరు ఇంజక్షన్ చేస్తుంటే, భాస్కరం పెదవులపై ఒక చిరునవ్వు వెలసి, వెలిసి పోయింది.

భాస్కరం పథ్యం తిన్న రోజు వరకూ శాంతి కూడా అన్నం ముట్టలేదు. కేవలం పళ్ళరసం మీద గడిపింది. అతని పథ్యంతోపాటు తానూ నాలుగు మెతుకులు కతికింది.

ఎలాగైతేనేం, భాస్కరం మామూలు మనిషైనాడు. తాను ఆరోగ్యవంతుడు కావడానికి శాంతి ఎంత శ్రద్ధ తీసుకుందీ, నియమ నిష్ఠలతో ఉన్నదీ భాస్కరం గ్రహించక పోలేదు. ఆమె విశ్వాసాన్ని కాదనడం అతని అభిమతం కాదు. అయితే, ఆ పేరుతో పదిమందిన్నీ పిలిచి సంతర్పణ చేస్తానంటే మాత్రం అతను ససేమిరా ఒప్పుకోడు.

• •

దాదాపు నాలుగు నెలలు గడిచాయి.

భాస్కరానికి ఏ విధంగా తన తిరుపతి మొక్కు విషయం చెప్పాలో అర్థం కాలేదు శాంతికి.

ఈజీఛైయిర్‌లో కూర్చుని, చిట్టిబాబుతో ఆడుకుంటున్న భాస్కరం దగ్గరకు వచ్చి, మెల్లగా "ఏమండీ!" అంది.

"ఏం శాంతీ? పిలిచావా?"

"ఆఁ."

"ఏమిటి సంగతి?"

"ఆ, ఏం లేదు . . . మీకు కోపం రాదంటే ఒక విషయం చెబుదామని . . ."

"కోపం దేనికి? చెప్పు శాంతి."

"ఏం లేదు? మీ కిలాంటి విషయాలు ఇష్టం ఉండవని తెలిసీ, ఎందుకో తెలియదుకానీ ఆ పరిస్థితిలో అలా కాక మరోలా ప్రవర్తించ లేకపోయాను. మీ ఆరోగ్యం కుదుటబడితే తిరుపతి వస్తానని మొక్కుకున్నాను. మీరేమో ఆరోగ్యం బాగుపడడానికీ, దేవుడికి ఏ సంబంధమూ లేదంటారు. నాకేమో ఆ స్వామి దయవల్లే మీరు తొందరగా ఆరోగ్యవంతులయ్యా రనిపిస్తుంది. కారణాలు, విశ్వాసాలు ఏమైతేనేం, మీరు ఆరోగ్యవంతులయ్యారు. అంతకన్న కావలసిందేం లేదు. అనుకున్న ప్రకారం మనం తిరుపతి వెళ్ళకపోతే నా మనసు అదోలా ఉంటుంది. నా కోసం మీరు వూ అనక తప్పదు." సాధ్యమైనంత వరకు ప్రాధేయపడుతున్నట్టుగా అంది శాంతి.

భాస్కరం ముఖం ప్రశాంతంగా ఉంది. ఆమె వైపు తిరిగి — "శాంతీ, ఒక్కటడుగుతాను. చెప్తావా? అన్నాడు."

"వూఁ."

"ఏం లేదు శాంతీ! ఆ దేవుడికున్న బిరుదులలో సర్వాంతర్యామి ఒకటి కదూ!"

"ఔను."

"మరి, ప్రహ్లాదు డన్నట్టు ఇందు గల డందు లేడనే సందేహం లేనప్పుడు, మనం ఆ స్వామి కోసం ఎంతో డబ్బు ఖర్చు పెట్టి, మరెంతో శ్రమపడి అంత దూరం ఎందుకు వెళ్ళాలి? సక్కుబాయి అన్నట్టు అక్కడ ఉండే పాండురంగడు ఇక్కడ లేడా? మన వూళ్ళోనూ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది కదా! నీతో పాటు ఈ దేవాలయ దర్శనం చేద్దామంటే నా కభ్యంతరం లేదు. అదైనా నీ కోసం మాత్రమే సుమా?" అన్నాడు భాస్కరం.

శాంతి గుండెల్లో రాయి పడింది. 'ఈ మొక్కు తీరే మార్గం మరి లేదా?' ఏం చెయ్యాలో, ఎలా ఈ మానసిక సంఘర్షణ నుంచి విముక్తి కావాలో ఆమెకు అర్థం కాలేదు. 'భాస్కరం అంతటి వాడు అప్పనడని తనకి ఆనాడే తెలుసు. అయినా ఆపద మొక్కులు మొక్కక తప్పలేదు. ఇప్పుడెలా' అనుకున్న ఆమెకు కనీసం ఉన్న వూళ్లో దేవాలయ దర్శనమైనా చేస్తానని భాస్కరం అన్న మాటలు కాస్త శాంతిని ఇచ్చాయి. అప్పటికి అంతే చాలు అనుకుంది ఆమె.

• • •

శనివారం ఉదయం చిట్టిజట్టుతో సహా రిక్షాలో బయలుదేరారు వెంకటేశ్వర స్వామి గుడికి. స్వామి వారి ఆరగింపుకు వడపప్పు, చక్కెర పొంగలి, పులిహోర ఇత్యాదులు పట్టుకున్నారు. అంతా మడిగా, నిష్ఠగా చేసింది శాంతి.

"శాంతీ, నీకు చాలా అసహ్యంగానూ, కోపంగానూ ఉంది కదూ నామీద! కానీ నా సిద్ధాంతంపై నాకెంతో విశ్వాసం ఉంది. వూపిరి ఉన్న మనిషిని మరిచి శిలా విగ్రహానికి స్వర్ణ కవచాలు తొడగడం సహించలేని వాస్తవిక వాదిని నేను. నా అభిప్రాయాలతో చాలా మంది ఏకీభవించరని, ఇవన్నీ పాశ్చాత్య నాగరికత కారణంగా వెర్రితలలు వేసే పిదపకాలపు బుద్ధి అనీ అంటారు. అంత మాత్రం చేత నేను నా అభిప్రాయం మార్చుకోను. దైవదర్శనం చేసే ప్రతివాడు ఏదో ఒక కోరికతో వెళ్ళుతున్నాడే తప్ప, నిస్వార్థంగా ఎవరైనా వెళ్ళుతున్నారా? సర్వేజనాః సుఖినో భవంతు—

అని ఎవరేనా ఆ దేవుణ్ణి స్మరిస్తున్నారా? కోరుకుంటున్నారా . . ." అని అంటుండగా, రిక్షావాడు సడెన్ బ్రేక్ వేశాడు. ఏమైందని చూసేసరికి రోడ్డుమీద ఒక గుంపు చేరి ఉంది. భాస్కరం దిగి ఆ గుంపులోకి వెళ్ళాడు. మధ్యలో ఒక పండు ముసలి వ్యక్తి అడ్డంగా పడి ఉన్నాడు. నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడుకుంటున్నారు.

"పాపం, ఎవరికో ముసలివాడు శోష వచ్చి పడిపోయినట్టున్నాడు."

"ఎన్నాళ్ళైందో భోంచేసి ఎండలు మరీ కాలిపోతున్నాయి. ఏ వూరి వాడో ఏమిటో పాపం!"

ఇలా తలో రకంగా అంటున్నారే కాని, ఎవరూ ముందుకు వచ్చి, ఆ వ్యక్తి ముఖం మీద కనీసం నీళ్ళైనా చల్లలేదు.

భాస్కరం అక్కణ్ణుంచి కదిలి, రిక్షాలో ఉంచిన నీళ్ళ చెంబు తీసుకుని వచ్చి ఆ వ్యక్తి ముఖం మీద చిలకరించాడు. తడి తువ్వాలుతో అతడి ముఖాన్ని తుడిచాడు. కొన్ని క్షణాలకు అతను తెప్పరిల్లాడు.

గబగబా రిక్షాలో ఉంచిన పానకం అతనికి తాగడానికి ఇచ్చాడు. ముసలాయన అర క్షణంలో ఆ పానకాన్ని ఖాళీ చేశాడు.

"శాంతీ ఆ చక్కెర పొంగలి ఇలా తీసుకురా" కేకేశాడు భాస్కరం.

అప్పటికే జరుగుతున్న దాన్ని అయోమయంగా చూస్తున్న శాంతి — "ఏమండీ! ఇది దేవుడి ఆరగింపుకదండీ" అంది.

"అవును శాంతీ! నాకు మనిషే దేవుడు. గుడిలో ఉండే ఆ దేవుణ్ణి చేసింది ఈ మనిషే! ముందా చక్కెర పొంగలి ఇలా తే! నిజంగా ఇవ్వాళ దేవుడే స్వయంగా ప్రసాదాన్ని ఆరగిస్తాడు" అని అంటున్న భాస్కరం వేపు నిరుత్తర అయి అలా చూస్తూండిపోయింది శాంతి.

భాస్కరం స్వయంగా ఆకులో ఇంత చక్కెర పొంగలి, ఇంత పులిహోర వేసి, ఆ వ్యక్తికి అందించాడు.

ఆవురావురుమని తింటున్న ఆ వ్యక్తి కేసి ఆనందంగా చూశాడు భాస్కరం. శాంతితో సహా ఆ చుట్టూ చేరిన ప్రజలంతా విస్తుపోయి చూస్తున్నారు ఈ దృశ్యాన్ని.

"నీ పేరేమిటి తాతా . . ." అడిగాడు భాస్కరం.

"దేవుడంటారయ్యా! దిక్కులేనోణ్ణి" అన్నాడు ప్రసాదం తింటున్న దేవుడు. ✱

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధవైద్యం!

నరముల బలహీనత
ధాతుపుష్టి యవ్వనశక్తి
హెర్నియా చర్మవ్యాధులకు
పోస్టు ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి
డా॥ దేవర, ఫోన్: 551, మార్కెట్ సెంటర్ వద్ద, తెనాలి.
బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు—17

చదవండి! చదివించండి!!
బాలభారతి
ఎక్కువ పేజీలు, అనుబంధ నవల
కలిగిన పిల్లల మాస పత్రిక. వెల రూ.1·25
సంపాదకుడు: వి.వి. నరసింహారావు
సహకార సంపాదకుడు: శశిభూషణ్
ఏజన్సీ వివరాలకు:
బాలభారతి
పో. బా. నెం 2645, మద్రాసు-600024.

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత. డి. గోపాలాచార్యుల వారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

ఉచితం ఉచితం !!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము సామాన్య రంగు పొందును. ప్రచారము నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు:
BHARAT AYURVEDASHRAM,
P.O. Katri Sarai (Gaya)